# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ సాంకేతికత, సాంస్కృతిక రంగాల్లో భారత్ కు ప్రత్యేక స్థానం ఉందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.**
2. **వందశాతం "సోలార్ రూఫ్ టాప్" విద్యుదుత్పత్తి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆకాంక్షించారు.**
3. **తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రెంవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఉభయ తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యే కోటాల్లో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది.**
5. **హోలీ పండుగ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.**

==========================

ప్రపంచ సాంకేతికత, సాంస్కృతిక రంగాల్లో భారత్ కు ప్రత్యేక స్థానం ఉందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్-వేవ్స్ ఈ ఏడాది మేలో జరగనున్న వేళ.. ఈ కార్యక్రమం గురించి ప్రపంచ దేశాలకు తెలియచెప్పే క్రమంలో కేంద్ర ప్రభుత్వం, విదేశీ దౌత్య వేత్తలతో ఢిల్లీలో అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ...దేశంలో ఒక బిలియన్ మందికి పైగా ప్రజలవద్ద మొబైల్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు డిజిటలైజేషన్‌కు అలవాటు పడ్డారని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

..వాయిస్: 32 సెకన్లు

---------------------------

వందశాతం "సోలార్ రూఫ్ టాప్" విద్యుదుత్పత్తి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆకాంక్షించారు. నిన్న జరిగిన శాసనసభా సమావేశాల్లో విద్యుత్ రంగంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రతీ నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై "సోలార్ రూఫ్ టాప్" రావాలని అన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే, తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కరెంట్ ఛార్జీలు పెంచబోమని ఆయన తెలియజేస్తూ....

..వాయిస్: 30 సెకన్లు

---------------------------

తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేంవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌తో ప్రత్యేకంగా సమావేశమైన రేవంత్ రెడ్డి వివిధ అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్ , గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ రాష్ట్ర ప్రాముఖ్యాన్ని చాటే ఇండియాజాయ్ వివరాలను కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ అభివృద్ధిని ప్రోత్సహించేందుకు మద్దతివ్వాలని జైశంకర్ ను కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు మొత్తం ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు నిన్న సాయంత్రంతో ముగిసింది. దీంతో జనసేన పార్టీ నుంచి కొణిదల నాగేంద్రరావు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు బీద రవిచంద్ర, బి.తిరుమల నాయుడు, కావలి గ్రీష్మ ప్రసాద్, భారతీయ జనతా పార్టీ నుంచి సోము వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణి ప్రకటించారు.

---------------------------

తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారత రాష్ట్ర సమితి నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గత సాయంత్రం 5గంటలకు ముగియడంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

---------------------------

ఈరోజు దేశవ్యాప్తంగా హోలీ పండుగను జరుపుకుంటున్నారు. దీనిని రంగులపండుగగా పిలుస్తారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో ఈ పండుగలో పాల్గొంటారు. హోలీ పండుగకు పురాణాల్లో ప్రాముఖ్యత ఉంది. ప్రతీఏడాది పాల్గుణమాసంలో పౌర్ణమిరోజున ఈ హోలీ జరుపుకుంటారు.

---------------------------

హోలీ పండుగ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఉత్సాహాన్ని శక్తిని నింపుతుందని వారు ఆకాంక్షించారు.

---------------------------

భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టరు సిహెచ్ ద్వారకా తిరుమల రావు తెలిపారు. ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో 75

సంవత్సరాల రాజ్యాంగం, వేవ్స్ సదస్సు, మహిళా భద్రత గురించి విజయవాడ లోని ఏపీఎస్ ఆర్టీసీ సమావేశ మందిరంలో నిన్న నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన "ఆకాశవాణీయం" ప్రత్యేక పుస్తకాన్ని ఆకాశవాణి విజయవాడ డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎమ్.సోమేశ్వరరావు, ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటితో కలిసి ఆవిష్కరించారు. అంతకు ముందు 75 సంవత్సరాల భారత రాజ్యాంగ విశేషాలను తెలిపే ఛాయ చిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని అన్నారు. పాత్రికేయులు కచ్చితమైన సమాచారం ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

---------------------------

రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి –ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను చంద్రబాబు పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటక రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.12 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాగా.. వాటికి ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తామన్న హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆడబిడ్డ నిధి పథకం కింద ఆర్థిక సాయంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ పథకాన్ని ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని......... పథకం అమలుకు ప్రభుత్వానికి కొంత వ్యవధి అవసరమని తెలుపుతూ...

...వాయిస్: 26 సెకన్లు

---------------------------

విద్యాసంస్థల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠాలను ప్రవేశపెట్టేందుకు అవసరమైన శిక్షణ, సర్టిఫికేషన్ మైక్రోసాఫ్ట్ అందిస్తుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలకు సంబంధించి యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం మైక్రోసాఫ్ట్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిన్న అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఒప్పంద పత్రాలపై నిన్న సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఏడాదిలో 2 లక్షల మంది యువతకు కృత్రిమ మేథ ఇతర సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నారు.

=====================